క్లుప్తంగా

నియామకం

అంబర్‌పేట: కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులుగా అంబర్‌పేటకు చెందిన శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు నియామకపత్రాన్ని శనివారం గాంధీభవన్‌లో పార్టీ జాతీయనాయకులు, మాజీ ఎంపీ వీ.హనుమంతరావు అందజేశారు. ఈ సందర్భంగా శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఒకటైన ఖైరాతాబాద్ జిల్లా మహిళా విభాగానికి తనను అధ్యక్షురాలిగా నియమించడం గర్వంగా ఉందన్నారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. తన పరిధిలోకి అంబర్‌పేట, ఖైరతాబాద్, గోషామహల్, నాంపల్లి, కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టాన పెద్దలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యలపై సమీక్ష



అంబర్‌పేట: వార్డు కార్యాలయానికి వచ్చే ప్రతి ఫిర్యాదుపై సత్వర చర్యలు తీసుకోవాలని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆమె డివిజన్ వార్డు కార్యాలయంలో అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, పరిష్కారాలను అడిగి తె లుసుకున్నారు. నిర్దిష్ట వ్యవధిలో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలని ఆమె సూచించారు.

రిటైర్డ్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ బీజేపీలో చేరిక

చిక్కడపల్లి: జీహెచ్‌ఎంసీ సర్కిల్– 15 రిటైర్డ్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ కె.రవిమన్యు శనివారం బీజేపీలో చేరారు. గాంధీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ ఆధ్వర్యంలో శనివారం జవహర్‌నగర్‌లో పలువురు యువకులు పార్టీ సీనియర్ నేతల సమక్షంలో పార్టీలో చేరారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షులు ఎ.వినయకుమార్ ఈ సందర్భంగా రవి మన్యుకు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి సాదరంగా ఆహ్వానించారు.

జనాభాకనుగుణంగా అభివృద్ధి పనులు



సివరేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కాచిగూడ: నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆధునీకరించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి, సివరేజ్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం కాచిగూడ డివిజన్ బాలప్రబాడలో కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే రూ.32 లక్షలతో చేపట్టనున్న సివరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేసే డ్రైనేజ్ పైపులైన్ ఏర్పాటుతో శాశ్వత డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

- ప్రణాళికాబద్ధంగా ప్రగతి సాధిస్తున్నామని, మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజీలు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు.
- ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్, డాక్టర్ శిరీష ఓంప్రకాష్‌యాదవ్, మన్నె శ్రీనివాస్‌యాదవ్, ఎస్.మహేందర్, బాలకృష్ణ, శ్రీశైలం, బీఆర్ఎస్ నేతలు కన్నె రమేష్ యాదవ్, సుభాష్ పటేల్, ఎస్.అరవింద్, భీమ్ రాజ్, ఎస్.రవియాదవ్, ప్రతిభ, మల్లికార్జున్ తదితరులున్నారు.

రూ.37 లక్షలతో..

ముషీరాబాద్: పద్మకాలనీ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని పద్మ కాలనీలో రూ.37 లక్షలతో నూతనంగా నిర్మించే పార్కు అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కులో పచ్చదనంతో పాటు ఓపెన్‌జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి పనులను అధికారులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కాలనీవాసులు రితేష్‌కుమార్, బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, నాయకులు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేందర్, కె.మాధవ్, జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు..

అంబర్‌పేట: నియోజకవర్గం ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు శాశ్వత ప్రాతిపదికన పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట్ డివిజన్ పటేల్‌నగర్‌లో రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రధానరోడ్లతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులకు వెనుకాడడం లేదని ఎమ్మెల్యే వివరించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా.. తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు సిద్ధార్థముదిరాజ్, సింగజోగి శ్రీనివాస్, మహేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హరియాణా గవర్నర్ పరామర్శ



పరామర్శిస్తున్న బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి: కార్మికశాఖ రిటైర్డ్ డిప్యూటి లేబర్ కమిషనర్ (డీసీఎల్) టీవీ దేవదత్ కుటుంబసభ్యులను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. ఆయన ఇటీవల మృతి చెందిన సందర్భంగా అశోక్‌నగర్ దోబీఘాట్‌లోని ఆయన నివాసానికి శనివారం సాయంత్రం చేరుకున్న గవర్నర్ దత్తాత్రేయ వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. తాను ఎంపీగా ఉండగా దేవదత్ అధికారిగా ఎంతో గొప్పగా ఉద్యోగసేవలు అందించారన్నారు. తెలంగాణ రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ దాసరి బాలయ్య, గాంధీ, మీనాక్షిదేవి, చైతన్య, రమ్య, గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, ఉమేష్, నరేందర్, బీఎన్‌రావు, సత్తిరెడ్డి అరుణ్, ప్రకాష్‌యాదవ్ దోనేటి సత్యం, అరుణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రైవేటు యూనివర్సిటీలను అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న గౌరీసతీష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు యూనివర్సిటీలను అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీపీడీపీజీఎంఏ) జేఏసీ కన్వీనర్ గౌరీసతీష్ విమర్శించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీడీపీజీఎంఏ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాస్ గ్యారెంటీ పేరుతో నాణ్యత ప్రమాణాలు లేకుండా సర్టిఫికెట్లను ఇస్తూ.. ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేటు యూనివర్సిటీలపై నియంత్రణ లేకుండా పోయిందని విమర్శించారు. ప్రైవేటు యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు ఉండకపోవడం విచారకరమన్నారు. దీనివల్ల రెగ్యూలర్ విద్యను పూర్తిచేసే వారి సంఖ్య 30–40 శాతానికి తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 36 కళాశాలలో దోస్త్ పోర్టల్ లేకుండా హైకోర్టు అనుమతి తీసుకుని అడ్మిషన్లు కొనసాగిస్తున్నారన్నారు. ఈ అడ్మిషన్ ప్రక్రియల్లో హైకోర్టు నిబంధనలను కూడా పాటించడం లేదన్నారు. ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్టారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, సలహాదారులు విష్ణువర్ధన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ శిక్షణ కేంద్రాల్లో పచ్చదనానికి ప్రాధాన్యం



హరితహారంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ పోలీస్ డాక్టర్ తరుణ్ జోషి

అంబర్‌పేట: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర పోలీసు శిక్షణ అధికారి ఐజీపీ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. శనివారం అంబర్‌పేట పోలీసు శిక్షణా కేంద్రంలో ప్రిన్సిపల్ మధుకర్ స్వామి ఆధ్వర్యంలో హరిత హారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యాలయాల ఆవరణలో సైతం పచ్చదనానికి అధికారులు, సిబ్బంది ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం ఉత్తమ పోలీసుగా అవార్డు దక్కించుకున్న హెడ్‌కానిస్టేబుల్ ఎం.వెంకటరమణకు ఆయన అవార్డును అందజేశారు. డీస్పీలు పిచ్చయ్య, జగన్, విజయ్‌కుమార్, చంద్రశేఖర్, రవికిరణ్, శ్రీధర్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 45 ఏళ్లకు పైగా పనిచేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులకు నేటికి కనీసవేతనం లేదని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో కేంద్రం తెచ్చిన వేతనం ఇంకా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా నిర్ణయించలేదన్నారు. త్వరితగతిన అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో దశలవారీగా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షురాలు ఎం.పద్మ, యూనియన్ ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్‌రావు, కోశాధికారి కె.సునీత, వెంకటమ్మ, పద్మ, జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన శ్రీనివాస్‌రావు



ముషీరాబాద్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముషీరాబాద్ నియోజకవర్గ నాయకులు అతినగరం సుధీష్‌లు కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలోని పలు రాజకీయ అంశాలపై శనివారం చర్చించారు. రాష్ట్రంలో పార్టీని అన్ని రంగాల్లో బలోపేతం చేస్తూ.. ప్రతి కార్యకర్తను కలుపుకొని వెళ్తున్నామన్నారు.

బీసీ గురుకులాలకు ఐఏఎస్‌ను నియమించాలి

ముషీరాబాద్: బీసీ గురుకులాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలంటే బీసీ గురుకులాలకు ఐఏఎస్ అధికారిని నియమించాలని బీసీ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. శనివారం విద్యానగర్ చౌరస్తాలోని ప్రధాన రోడ్డులో బీసీ విద్యార్థి సంఘం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ మాట్లాడుతూ.. ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, మెడిసిన్ తదితర కోర్సులకు ప్రభుత్వమే పూర్తి ఫీజు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి వేలాది మంది విద్యార్థులతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. వెంకట్ బలరాం, బాలస్వామి, వినోద్, ప్రవీణ్, సంతోష్, నవీన్ తదితరులున్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి



శాస్త్రీనగర్ బస్తీలో ప్రచారం చేస్తున్న బీజేపీ నగర మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

కాచిగూడ: అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని బీజేపీ హైదరాబాద్ నగర మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గోల్నాక డివిజన్ శాస్త్రీనగర్ బస్తీలో బీజేపీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయన పర్యటించి డబుల్ బెడ్రూం ఇళ్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈనెల 7న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీనేతలు కేసరి నర్సింగ్‌రావు, రమేష్, శ్రీనివాస్, రాము, రాజు, వెంకటేష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న హైస్కూల్ సెక్రటరీ వసుంధరరెడ్డి

కాచిగూడ: బెంగళూర్‌లో ఈనెల 6న ఆదివారం జరిగే 9వ షోటోఖాన్ జాతీయ కరాటే పోటీల్లో రాష్ట్రం నుంచి ఎంపికైన జీవీఆర్ కరాటే విద్యార్థులను మాడపాటి హనుమంతరావు హైస్కూల్ సెక్రటరీ వసుంధరరెడ్డి అభినందించారు. శనివారం నారాయణగూడలోని పాఠశాలలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఆటపాటల్లో ప్రావీణ్యం పొందితే వారి బాల్యం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. పిల్లలకు చదువుతో పాటు ఆటలు అవసరమన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు పతకాలు సాధించి రాష్ట్ర గౌరవాన్ని నిలపాలి ఆమె ఆకాంక్షించారు. అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్. గోపాల్‌రెడ్డి, షైనీ, ఘణ సంతోషిణి, దుర్గాచరణ్, ఆదిత్య, సహార్ష్ తదితరులున్నారు.

నాసా ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఎస్.సవిత

కాచిగూడ: అమెరికా నాసా సంస్థ, నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవెల్ కాంటెస్ట్‌లో శ్రీ చైతన్య బర్కత్‌పుర బ్రాంచి విద్యార్థులు పాల్గొని ఉత్తమ ఫలితాలను సాధించారు. శనివారం పాఠశాలలో విద్యార్థులను ప్రిన్సిపల్ ఎస్.సవిత ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేసి అభినందించారు. విద్యార్థులకు అవసరమైన శాస్త్రీయ ప్రయోగాలు, నైపుణ్యాలు చాటేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఏజీఎం సతీష్, అకాడమిక్ కో– ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, డీన్ యుగేందర్, వినోద్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రైల్లో గుర్తుతెలియని మృతదేహం



కాచిగూడ: తిరుపతి నుంచి న్యూఢిల్లీ వెళ్లే ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో జనరల్ కోచ్‌లో ఓ గుర్తుతెలియని వ్యక్తి (50) మృతదేహం లభ్యమైందని కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ తెలిపారు. శనివారం కాచిగూడ రైల్వేస్టేషన్ 2వ ప్లాట్‌ఫారంపై ఉన్న సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినతిపత్రం అందజేత

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ హరినగర్ మదీనా మజీద్‌కు తాగునీటి సౌకర్యం కల్పించాలని, డ్రైనేజీ పైపులైన్‌తో పాటు నూతన లైన్‌ను వేయాలని మజీద్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్, ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, మురళి, మజీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ రహీద్, సత్తార్, అబ్దుల్ రజాక్, అజీబ్, రజాక్ ఖరేషీ, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

'పరివర్తన- పరమాత్మ' పుస్తకావిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత ఆచార్య బీ.ఎం.రవిప్రసాద్ రచించిన 'పరివర్తన–పరమాత్మ' పుస్తకాన్ని శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిలో ప్రతిక్షణం పరివర్తనలు జరుగుతున్నాయని మనుషులమైన మనమే వెనుకబడి ఉన్నామన్నారు. సీనియర్ జర్నలిస్టు బొజ్జ భిక్షమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేరేళ్ల కోటేశ్వర్‌రావు, రమాదేవి, ప్రతీష్‌కుమార్ తదితరులున్నారు.

ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి



'అశోకవనం' పుస్తకాన్ని కావ్యగానం చేస్తున్న సుద్దాల అశోక్‌తేజ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే సమస్యలపై అవగాహన పెరుగుతుందని ప్రముఖ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో సుద్దాల అశోక్‌తేజ రచించిన 'అశోకవనం'ను కావ్యగానం చేశారు. ఆయన రాసిన పుస్తకంపై ఆరు గంటల పాటు ఏక కంఠ పఠనం చేశారు. గతంలో ఉన్న పొరపాట్లను సరిదిద్దామన్నారు. ఆనాటి సమాజాన్ని పోలుస్తూ.. నేటి సమాజాన్ని ఆయన ప్రశ్నించారన్నారు. ప్రొఫెసర్ కోయ కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. చరిత్రలో తిరస్కరించబడిన వారి మంచికోణాన్ని సుద్దాల అశోక్‌తేజ తన అశోకవనంలో అద్భుతంగా వివరించారన్నారు. భూపతివెంకటేశ్వర్లు, టీపీఎస్‌కే ప్రతినిధులు రాములు, సాహితీవేత్తలు పీ.ఎన్.మూర్తి, మోత్కూరి నరహరి, విజయ్‌కుమార్, కె.ఆనందచారి, రమేష్, దూది సుశీల, అందె భాస్కర్ తదితరులున్నారు.

రాహుల్‌గాంధీకి సుప్రీంకోర్టు స్టే పై కాంగ్రెస్ సంబరాలు



రాహుల్‌గాంధీ భారీ ఫ్లెక్సీ వద్ద కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో ఆ పార్టీ శ్రేణులు శనివారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో సంబరాలు నిర్వహించుకున్నారు. 20 ఫీట్ల రాహుల్‌గాంధీ ఫ్లెక్సీని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు, ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. ముషీరాబాద్ నియోజకవర్గ ఏ,బీ బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్, వీడీ.కృష్ణ, మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనాయాదవ్, వాజీద్‌హుస్సేన్, నాయకులు శీలం సత్యనారాయణ, వెంకట్, శంకర్, అభిషేక్ కెన్నడీ, బాస్కర్ తదితరులున్నారు.

నల్లకుంట: కేంద్రం న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకొచ్చినా.. న్యాయమే గెలుస్తుందని గ్రేటర్ హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్ అన్నారు. ఈ మేరకు శనివారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా టపాకాయలు కాల్చి, బాటసారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

నల్లకుంట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసిన గుజరాత్‌కోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంపై కాంగ్రెస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం నల్లకుంట డివిజన్ నర్సింహబస్తీలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. వెంటనే ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని తిరిగి పునరుద్ధరించాలని లోక్‌సభ స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ జయంత్యుత్సవాలు

ముషీరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ ప్రజా ఉద్యమాలు చేసిన తెలంగాణ సిద్ధాంతకర్త అని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.సుకన్య అన్నారు. శనివారం వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా కళాశాల సామాజిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు ఎ.తిరుపతి, డాక్టర్ కిశోర్‌కుమార్, ఎస్.రవిప్రసాద్, డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ చిన్నబాబు, ఈ.నర్సింగరావు, ఈశ్వర్, శ్రీదేవి, శ్రీనివాస్, డాక్టర్ భారతి, డాక్టర్ రాజారత్నం, డాక్టర్ కె.నిర్మల, డాక్టర్ యాదవ్, ఎం.సంగీత, బి.విజయనిర్మల, ఎల్.విష్ణుప్రియ, ఇష్రత్ సుల్తానా, షీబారాణిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్టోబర్ 1 నుంచి జాతీయ సదస్సు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 1 నుంచి రెండ్రోజుల పాటు నగరంలో 'భారత రాజ్యాంగం –ప్రజలు' అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ తెలిపారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఈ జాతీయ సదస్సుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, సామాజికవేత్తలు పాల్గొంటారన్నారు. జి.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా కె.పార్థసారధి, చీఫ్ ప్యాట్రన్‌గా బీ.ఎస్.ప్రసాద్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావులు ఉంటారన్నారు. నాగారం అంజయ్య, ఐలు ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి, కోశాధికారి వేణుగోపాల్, కార్యదర్శివర్గ సభ్యులు శైలజ, రాంచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.